Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143

WANTED

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును

సంప్రదించండి సెల్: 9440815774

Associate Editor: K L KRISHNAM RAJU | Volume: 6 | Issue : 131 | Thursday 24.04.2025 | Price : Rs.3/- | Pages : 4

అసోసియేట్ ఎడిటర్ కే ఎల్ కృష్ణంరాజు | సంపుటి: 6 | సంచిక : 131 | గురువారం 24. 04. 2025 | వెల : రూ.3/- | పేజీలు 4

## దాడి సూత్రధారులను కఠినంగా...
# శిక్షిస్తాం : మోదీ

ఉగ్రదాడిపై భారత్‌కు అమెరికా పూర్తి మద్దతు: వాన్స్

- పహల్గామ్ ఉగ్రదాడిపై ప్రధాని మోదీకి అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ ఫోన్ కాల్

దాడిని తీవ్రంగా ఖండించి, మృతులకు సంతాపం తెలిపిన వాన్స్

- ఉగ్రవాదంపై ఉమ్మడి పోరులో భారత్‌కు అన్ని విధాల సహాయం చేస్తామని అమెరికా హామీ

అంతకుముందే మోదీతో ఫోన్లో మాట్లాడిన అధ్యక్షుడు ట్రంప్

న్యూఢిల్లీ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని అమెరికా తీవ్రంగా ఖండించింది. భారత పర్యటనలో ఉన్న అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ బుధవారం మధ్యాహ్నం ప్రధాని నరేంద్ర మోదీకి ఫోన్ చేసి మాట్లాడారు. ఈ హేయమైన దాడి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసిన వాన్స్, ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించడానికి అమెరికా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ప్రస్తుతం ఆగ్రాలో ఉన్న వాన్స్.. ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడుతూ, పహల్గామ్ దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో భారత ప్రజలకు అమెరికా అండగా నిలుస్తుందని పునరుద్ఘాటించారు. ఉగ్రవాదంపై మిగతా 2 లో



## ఉగ్రదాడి తీవ్రంగా...
# కలిచివేస్తోంది
### : డిప్యూటీ సీఎం పవన్



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తనను తీవ్రంగా కలిచివేస్తోందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈ దాడిలో చనిపోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ జనసేన పార్టీ ఏపీ, తెలంగాణలో మూడు రోజుల పాటు సంతాప దినాలను పాటిస్తుందని తెలిపారు. "పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తీవ్రంగా కలిచివేస్తోంది. ఈ దాడిలో చనిపోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. వారి గౌరవార్థం జనసేన పార్టీ ఏపీ, తెలంగాణలో మూడు రోజుల పాటు సంతాప దినాలను పాటిస్తుంది. మా పార్టీ జెండాను అవనతం చేస్తున్నాం. ఈ క్లిష్ట సమయంలో ఐక్యంగా ఉందాం. మన మిగతా 2 లో

## విమాన ఛార్జీలు...
# పెంచరాదు

శ్రీనగర్ నుంచి అమాంతం పెరిగిన టికెట్ ధరలు..

రామ్మోహన్ నాయుడు కీలక ఆదేశాలు

పహల్గాం ఉగ్రదాడి తర్వాత శ్రీనగర్ విమాన ఛార్జీల నియంత్రణపై కేంద్రం చర్యలు

: మంత్రి రామ్మోహన్ నాయుడు ఆదేశం

పర్యాటకుల తరలింపునకు అదనపు విమానాల ఏర్పాటు

టికెట్ రద్దు, మార్పు రుసుములు రద్దు చేసిన ఎయిర్‌లైన్స్

6 గంటల్లో 3,337 మంది ప్రయాణించిన వైనం



న్యూఢిల్లీ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో శ్రీనగర్ నుంచి విమాన ప్రయాణ ఛార్జీలను అదుపులో ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. విమాన టికెట్ ధరలను విపరీతంగా పెంచవద్దని అన్ని విమానయాన సంస్థలకు కఠిన ఆదేశాలు జారీ చేసినట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఉగ్రదాడి మిగతా 2 లో

## కాకినాడ అమ్మాయి...
# అరుదైన రికార్డు




కాకినాడ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఏపీ పదో తరగతి ఫలితాల్లో కాకినాడ అమ్మాయి అరుదైన రికార్డు సాధించింది. ఏపీ చరిత్రలోనే ఇప్పటి వరకు ఎవరూ సాధించని మార్కులు ఆ విద్యార్థిని సాధించింది. తొలిసారిగా 600కు 600 మార్కులు సాధించి రికార్డు సృష్టించింది. ఈ చరిత్ర సృష్టించిన అమ్మాయి పేరు నేహాంజని. కాకినాడ భాష్యం స్కూల్‌లో పదో తరగతి చదివింది. 600కు 600 మార్కులు సాధించిన నేహాంజనికి శుభాకాంక్షలు వెలువెత్తుతున్నాయి. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, పాఠశాల యాజమాన్యం సంతోషంలో మునిగిపోయారు. ఏపీ టెన్త్ ఫలితాల్లో 81.14 శాతం ఉత్తీర్ణత నమోదైన సంగతి తెలిసిందే. పరీక్షలకు మొత్తం 6,14,459 మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో మిగతా 2 లో

## విజయం సాధించని వారు...
# నిరుత్సాహపడకండి

ఈ రిజల్ట్స్ చాలా సంతోషాన్ని ఇచ్చాయన్న మంత్రి లోకేశ్

టెన్త్ ఫలితాలను 'ఎక్స్' వేదికగా విడుదల చేసిన మంత్రి లోకేశ్

పదో తరగతి ఫలితాల్లో 81.14 శాతం మంది ఉత్తీర్ణత

1,680 స్కూళ్లలో 100 శాతం ఉత్తీర్ణత నమోదు

పార్వతీపురం మన్యం జిల్లాలో అత్యధికంగా 93.90 శాతం ఉత్తీర్ణత

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఆంధ్రప్ర దేశ్ రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు-2025 మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా విడుదల చేశారు. పదో తరగతి, ఓపెన్ స్కూల్ ఫలితాలను ఒకేసారి విడుదల చేశారు. పదో తరగతి మిగతా 2 లో



## ఉగ్రవాదంతోఎలాంటి లక్ష్యాలు...
# నెరవేరలేదు : సీఎం

ఉగ్రదాడిలో తెలుగు వ్యక్తులు మృతి చెందడం పట్ల సంతాపం తెలిపిన సీఎం చంద్రబాబు

ఫహల్గామ్ ఉగ్రదాడిలో ఇద్దరు తెలుగు వ్యక్తుల మృతి

తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఏపీ సీఎం చంద్రబాబు

ఉగ్రవాద చర్యలు సమాజానికి మాయని మచ్చ వంటివని వెల్లడి

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద జరిగిన ఉగ్రవాద దాడిలో చెందిన ఇద్దరు తెలుగు వ్యక్తులు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన జె.ఎస్. చంద్రమౌళి, మధుసూదన్ కుటుంబాలకు ఆయన ప్రగాఢ సంతాపం మిగతా 2 లో




## కశ్మీర్‌లో చిక్కుకున్న వారిని క్షేమంగా...
# తీసుకురండి..

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కేటీఆర్ విజ్ఞప్తి

హైదరాబాద్, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** జమ్ముకశ్మీర్‌లోని పెహల్‌గామ్‌లో ఉగ్రవాదులు సృష్టించిన నరమేధం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ క్రమంలో జమ్ముకశ్మీర్ పర్యటనకు వెళ్లి తెలంగాణకు చెందిన 80 మంది పర్యాటకులు నిన్నటి నుంచి శ్రీనగర్‌లో చిక్కుకుపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకుని, వారిని సురక్షితంగా స్వగ్రామాలకు చేర్చేందుకు ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో తెలంగాణ పర్యాటకులకు అవసరమైన సంరక్షణ, సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేటీఆర్ కోరారు. వారిని సురక్షితంగా ఇండ్లకు చేర్చాలని విజ్ఞప్తి మిగతా 2 లో



## ఉత్తరాంధ్రకు...
# ఉజ్వలమైన భవిష్యత్..

విశాఖ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఉత్తరాంధ్ర ప్రజల ఋణం తీర్చుకునేలా రాష్ట్రంలో ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, ఉత్తరాంధ్రకు ఉజ్వలమైన భవిష్యత్ ఉందని ఏపీ నీటీపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. బుధవారం ఆయన విశాఖ లో మీడియా సమావేశంలో మాట్లాడారు.. జగన్ హయాంలో సాగు, తాగు నీటి ప్రాజెక్టులు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని, ప్రాజెక్టుల నిర్వహణ అసలు పట్టించుకోలేదని తీవ్రస్థాయిలో మిగతా 2 లో



# సంపాదకీయం

## సైనిక దుస్తుల్లో వచ్చి మారణహోమం

జమ్మూ కాశ్మీర్‌లోని మినీ స్విట్జర్లాండ్‌గా భావించే పహల్గామ్‌లోని బైసరన్ లోయ అందాలను.. అక్కడి ప్రకృతిని చూసి ఆనందించాలని వచ్చిన పర్యాటకుల ఆశలు గల్లంతయ్యాయి. పక్కా ప్లాన్ వేసుకుని ఆర్మీ దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు.. 27 మందిని పొట్టనపెట్టుకున్నారు. మరో 20 మంది ప్రాణాల కోసం చావు బతుకుల మధ్య ఆస్పత్రుల్లో పోరాటం చేస్తున్నారు. కాశ్మీర్ అందాలను ఆస్వాదించాలని వచ్చిన ఆ టూరిస్ట్‌లు.. అచేతన స్థితిలో పడిపోయారు. ఈ క్రమంలోనే పహల్గామ్ ఉగ్రదాడికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు.. మీడియా, సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. అందులో ఒక ఫోటో ఇప్పుడు అందరి హృదయాలను కదిలిస్తోంది. ఓ వ్యక్తి మరణించగా.. అతడి పక్కనే భార్య ఏడుస్తున్న ఫోటో.. ఇప్పుడు అందరి కంట కన్నీరును పెట్టిస్తోంది.కొత్తగా పెళ్లి చేసుకుని.. హనీమూన్ కోసం జంటగా వచ్చిన ఆ ఇద్దరిలో ఇప్పుడు ఒక్కరే మిగిలారు. ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో భర్త ప్రాణాలు కోల్పోగా.. ఆ మృతదేహం పక్కనే భార్య రోదిస్తున్న ఫోటో ఇప్పుడు వైరల్ కావడంతో అది అందరినీ కలచి వేస్తోంది. ఎంతో ఆనందంగా జరిగిన ట్రిప్.. ముగిసే సమయంలోనే ఉగ్రవాదుల దాడి కారణంగా ఒక్కసారిగా తారుమారైంది. హనీమూన్‌కి వచ్చిన తమపై దాడి చేశారని.. తన భర్తను దగ్గర నుంచి కాల్చి చంపినట్లు మహిళ వణుకుతున్న గొంతుతో చెప్పింది. తాను అక్కడే కూర్చుని భేల్ పూరి తింటున్న సమయంలో తన భర్త పక్కనే ఉన్నాడని.. అంతలోనే ఓ వ్యక్తి వచ్చి తన భర్తను నువ్వు ముస్లింవా అని అడిగినట్లు చెప్పింది. అందుకు తాను ముస్లిం కాదని తన భర్త చెప్పడంతో కాల్చి చంపినట్లు ఆమె కన్నీరు మున్నీరు అయింది. భర్త శవం పక్కన కూర్చుని ఉన్న ఆ యువతి ఫోటో ఇప్పుడు అందరితో కన్నీరు పెట్టిస్తోంది.అప్పటివరకు సంతోషంగా కాశ్మీర్ అందాలను, హిమాలయాలను, పచ్చటి చెట్లు, గడ్డి భూములను చూసి ప్రపంచాన్ని మైమరిపోయిన టూరిస్టులు.. క్షణాల్లోనే ప్రాణాలు విడిచారు. ఈ దాడికి లష్కరే తోయిబా ప్రాక్సీ సంస్థ అయిన "ది రెసిస్టెన్స్ ఫ్రంట్" ఉగ్ర సంస్థ బాధ్యత ప్రకటించింది. ఇక ఈ ఉగ్రదాడి తర్వాత ఆ ప్రాంతం మొత్తం భీతావహ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం అక్కడి దాడికి సంబంధించిన వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. తమను, తమ వారిని కాపాడాలి అంటూ కన్నీటితో అందరినీ వేడుకుంటున్న వీడియోలు కలిచివేస్తున్నాయి. "ప్లీజ్ నా భర్తను రక్షించండి" అంటూ ఓ మహిళ ఏడుస్తూ బతిమిలాడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ఇక సైనిక దుస్తుల్లో వచ్చిన ఏడుగురు ఉగ్రవాదులు.. ఈ మారణహోమానికి తెరలేపినట్లు ప్రాణాలతో బయటపడిన ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. కనిపించిన వారిని కనిపించినట్లే పాయింట్ బ్లాంక్‌లో తుపాకీ పెట్టి కాల్చినట్లు పేర్కొన్నారు. అది ఒక భయానక సంఘటనగా వారు అభివర్ణిస్తున్నారు. మినీ స్విట్జర్లాండ్‌గా పిలుచుకునే అనంత్‌నాగ్ జిల్లాలోని పహల్‌గామ్‌లోని బైసరన్ ప్రాంతం.. ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరు. దీంతో దేశవిదేశాలకు చెందిన పర్యాటకులు బైసరన్ లోయ ప్రాంతాన్ని చూసేందుకు వస్తారు. అయితే అలాంటి టూరిస్ట్‌లను లక్ష్యంగా చేసుకుని..ఆర్మీ దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు దాడి చేశారు. ఇక ఈ ఉగ్రదాడికి పాల్పడింది తామే అంటూ టీఆర్ఎఫ్ ప్రకటించింది.దాదాపు 40 మంది పర్యాటకులను చుట్టుముట్టి.. అత్యంత సమీపం నుంచి కాల్పులు జరపడంతో వారు అక్కడికక్కడే రక్తపు మడుగులో పడి ప్రాణాలు విడిచారు. మతం ఏంటని.. పేరు ఏంటని అడిగి మరీ కాల్పులు జరిపినట్లు పర్యాటకులు చెబుతున్నారు. ఐడీ కార్డులు ఇవ్వాలని వారిని బెదిరించినట్లు చెప్పారు. గాయపడిన క్షతగాత్రులు మహారాష్ట్ర, గుజరాత్, యూపీకి చెందిన వారుగా గుర్తించారు. పలువురు విదేశీ పర్యాటకులు కూడా మృతుల్లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. మరికొందరు బుల్లెట్ గాయాలతో ప్రాణాలు దక్కించుకునేందుకు ఆర్తనాదాలు చేశారు. ఇక బైసరన్ ప్రాంతంలో తుపాకీ కాల్పుల శబ్దాన్ని విన్న సైన్యం.. హుటాహుటిన అక్కడికి చేరుకుంది. హెలికాప్టర్ సాయంతో గాయపడిన వారిని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ బైసరన్ ప్రాంతానికి కేవలం కాలినడకన లేదా గుర్రాలపై మాత్రమే చేరుకునే అవకాశం ఉండటంతో బాధితులను వేగంగా తరలించడం సైన్యానికి కష్టతరం అయింది.మరోవైపు.. త్వరలోనే మంచు కొండల్లో పవిత్రమైన అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం కానున్న వేళ.. ఈ భారీ ఉగ్రదాడి జరగడం తీవ్ర సంచలనంగా మారింది. ఉగ్రవాద దాడి కోసం ాఉచి ఉగ్రవాదులకు బైక్‌లను అందించి ఉండవచ్చని భద్రతా సంస్థలు అనుమానిస్తున్నాయి. సంఘటనా స్థలానికి సమీపంలో లభించిన అనుమానాస్పద బైక్ ఎవరిదో తెలుసుకోవడానికి దర్యాప్తు జరుగుతోంది.పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి దేశాన్నే కాదు.. యావత్ ప్రపంచాన్నిగ్ర్భ్భంతికి గురిచేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలు ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఉగ్రవాదంపై పోరాటంలో భారత్‌కి తమ మద్దతును తెలియజేస్తున్నాయి. పహల్గామ్‌లో దాడి జరిగిన ప్రదేశం దగ్గర నంబర్ ప్లేట్ లేని నల్లటి బైక్ ఎవరిది? అనే విషయం ప్రస్తుతం చర్చణీయాంశంగా మారింది. 38 రోజుల పాటు కొనసాగే అమర్‌నాథ్ యాత్ర జులై 3వ తేదీన ప్రారంభం కానుంది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది యాత్రికులు రెండు మార్గాల్లో చేరుకోనున్నారు. అనంత్‌నాగ్ జిల్లాలో పహల్గాం మార్గంలోనే 48 కిలోమీటర్ల మేర ఉండగా.. 14 కిలోమీటర్ల మార్గం గందేర్బల్ జిల్లా నుంచి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో తాజాగా పర్యాటకులపై ఉగ్రదాడి జరగడం అమర్‌నాథ్ యాత్రికులకు తీవ్ర భయాందోళన కలిగిస్తోంది.

## విమాన ఛార్జీలు...

అనంతరం శ్రీనగర్ నుంచి ప్రధాన నగరాలకు విమాన టికెట్ల ధరలు అమాంతం పెరిగాయి. ఢిల్లీ, ముంబై వంటి నగరాలకు టికెట్ ధరలు కొన్ని సందర్భాల్లో రూ. 20,000 దాటాయి. పలు విమానయాన సంస్థల ఆన్‌లైన్ పోర్టళ్లలో టికెట్లు అమ్ముడైపోయాయని లేదా పరిమిత సంఖ్యలో అధిక ధరలకు అందుబాటులో ఉన్నాయని కనిపించింది. ఈ పరిణామాల నేపథ్యంలో మంత్రిత్వ శాఖ జోక్యం చేసుకుంది.శ్రీనగర్ నుంచి పర్యాటకుల సురక్షిత ప్రయాణానికి నిరంతరం కృషి చేస్తున్నామని రామ్మోహన్ నాయుడు తెలిపారు. విమాన ఛార్జీలు పెంచకుండా ఉండేందుకు విమానయాన కంపెనీలకు కఠిన ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ఛార్జీలను పర్యవేక్షిస్తూ సహేతుకమైన స్థాయిలో ఉండేలా చూస్తున్నట్లు వెల్లడించారు.పర్యాటకుల సౌకర్యార్థం, చిక్కుకుపోయిన వారిని తరలించేందుకు అదనపు విమాన సర్వీసులను నడుపుతున్నట్లు ఆయన ధృవీకరించారు. తొలుత ఢిల్లీ, ముంబైలకు చెరో రెండు చొప్పున మొత్తం నాలుగు అదనపు విమానాలను మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసింది. బుధవారం నాడు ఢిల్లీకి మరో మూడు అదనపు విమానాలను నడిపారు. వాటిలో ఇండిగో 6E 3203 (సాయంత్రం 5 గంటలకు బయలుదేరి 6 గంటలకు చేరుకుంటుంది), ఇండిగో 6E 3103 (సాయంత్రం 6 గంటలకు బయలుదేరి 7:30 గంటలకు చేరుకుంటుంది), రాత్రి 10:30 గంటలకు స్పైస్‌జెట్ విమానం బయలుదేరుతుంది. శ్రీనగర్ నుంచి పనిచేస్తున్న అన్ని విమానయాన సంస్థలు టికెట్ల రద్దు, ప్రయాణ తేదీ మార్పులపై విధించే రుసుములను రద్దు చేశాయని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇది మానవత్వం, సంఘీభావం చూపించాల్సిన సమయమని కేంద్ర మంత్రి అన్నారు. ప్రతి పౌరుడికి అండగా ఉంటామని, అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు.ప్రయాణికుల రద్దీ పెరిగిన నేపథ్యంలో శ్రీనగర్ విమానాశ్రయంలో సౌకర్యాలను విస్తరించారు. బుధవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య విమానాశ్రయం నుంచి 20 విమానాలు బయలుదేరాయని, మొత్తం 3,337 మంది ప్రయాణికులు వెళ్లారని మంత్రి తెలిపారు. ప్రయాణికుల కోసం ఆహారం, నీరు పంపిణీ చేస్తున్నామని, టెర్మినల్ వెలుపల వేచి ఉండే వారి కోసం అదనంగా ఒక టెంట్‌ను ఏర్పాటు చేశామని ఆయన వివరించారు.ఇదిలా ఉండగా, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) కూడా బుధవారం ఒక అడ్వైజరీని జారీ చేసింది. శ్రీనగర్ నుంచి విమాన సర్వీసుల సంఖ్యను పెంచాలని, బుకింగ్ మార్పులపై రుసుంలను రద్దు చేయాలని ఎయిర్ ఇండియా, ఇండిగో సహా అన్ని వాణిజ్య విమానయాన సంస్థలను కోరింది. పర్యాటకుల నుంచి ఊహించని డిమాండ్ కారణంగా శ్రీనగర్ నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు నిరంతరాయ కనెక్టివిటీ అవసరమని డీజీసీఏ నొక్కి చెప్పింది.

## ఉగ్రవాదంతోఎలాంటి లక్ష్యాలు...

తెలిపారు.ఈ విషాద ఘటనపై స్పందించిన ముఖ్యమంత్రి, ఉగ్రవాదుల దాడిలో తెలుగు సమాజానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మరణించడం అత్యంత బాధాకరమని అన్నారు. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కష్ట సమయంలో వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ తీరని లోటును తట్టుకునే శక్తిని ఆ కుటుంబాలకు ఇవ్వాలని ఆకాంక్షించారు.ఉగ్రవాద చర్యలు సమాజానికి మాయని మచ్చ వంటివని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. చరిత్రను పరిశీలిస్తే, ఉగ్రవాదం, హింస ద్వారా ఏ లక్ష్యాలు నెరవేరలేదని స్పష్టమవుతుందని అన్నారు. ఇలాంటి దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడటంలో, ఉగ్రవాదంపై పోరాటంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంపూర్ణ మద్దతుగా నిలుస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో కేంద్రం తీసుకుంటున్న దృఢమైన, నిర్ణయాత్మక చర్యలకు తమ సంఘీభావం ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ ఘోరానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు.

**వీరయ్య చౌదరి భౌతిక కాయానికి నివాళులు అర్పించిన చంద్రబాబు... హంతకులకు మాస్ వార్నింగ్ :**

ఒంగోలులో నిన్న రాత్రి హత్యకు గురైన తెలుగుదేశం పార్టీ నేత వీరయ్య చౌదరి భౌతికకాయానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇవాళ నివాళులర్పించారు. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు గ్రామానికి చేరుకున్న సీఎం, వీరయ్య చౌదరి పార్థివదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.అనంతరం, వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పి ఓదార్చారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని, ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. వీరయ్య చౌదరి అంత్యక్రియల్లో సీఎం చంద్రబాబు పాల్గొంటారని తెలుస్తోంది.అమ్మనబ్రోలుకు చేరుకున్న ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, ఆనం రామనారాయణ రెడ్డి, డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, పలువురు శాసనసభ్యులు, ఇతర తెలుగుదేశం పార్టీ నాయకులు ఉన్నారు. వారు కూడా వీరయ్య చౌదరి భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, వీరయ్య చౌదరిని దారుణంగా హతమార్చారని వెల్లడించారు. కరడుగట్టిన నేరస్తుల కంటే దారుణంగా హత్య చేశారని, 53 చోట్ల కత్తిపోట్లు ఉన్నాయంటే ఎలా చంపారో అర్థం చేసుకోవచ్చని అన్నారు. వారు భూమ్మీద ఉండేందుకు అనర్హులు... వారిని ఎట్టి పరిస్థితుల్లోనైనా పట్టుకుని తీరుతామని స్పష్టం చేశారు. ఇంత ఘోరానికి పాల్పడిన వ్యక్తులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని, తద్వారా వీరయ్య చౌదరి ఆత్మకు శాంతి కలిగేలా చేస్తామని చెప్పారు. వీరయ్య చౌదరి ఎంతో సమర్థుడైన నాయకుడని, పార్టీకి ఎన్నో సేవలు అందించారని చంద్రబాబు కొనియాడారు. లోకేశ్ తో పాటు పాదయాత్రలో 100 రోజుల పాటు తిరిగాడని గుర్తు చేసుకున్నారు. ఎవరికి కష్టం వచ్చినా ఆదుకునే వ్యక్తి... పిలిస్తే పలికే నేత వీరయ్య... ఇలాంటి వ్యక్తిని చంపేశారని, నిందితులను వదిలిపెట్టే ప్రశ్నే లేదని పునరుద్ఘాటించారు. నిందితులు ఎంత తెలివైనవాళ్లు అయినా ఎక్కడో ఒక చోట క్లూస్ వదిలిపెడతారని, వారు ఎక్కడున్నా గాలించి పట్టుకుంటామని అన్నారు. హంతకుల కోసం 12 బృందాలు గాలిస్తున్నాయని తెలిపారు. ఈ మండలంలో టీడీపీకి 10 వేల ఓట్ల మెజారిటీ వచ్చిందంటే వీరయ్య చౌదరి సత్తా ఏంటో అర్థమవుతుందని అన్నారు. ఇటువంటి మంచి నాయకుడ్ని కోల్పోవడం బాధ కలుగుతుందని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలో ఉండి కూడా ఇలాంటి ఘోరాలు జరుగుతుండడాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి హత్యా రాజకీయాలు చేసే వ్యక్తులకు ఒకటే హెచ్చరిక... మీరు కూడా కాలగర్భంలో కలిసిపోతారు జాగ్రత్త అంటూ వార్నింగ్ ఇచ్చారు. కార్యకర్తలు భయపడొద్దని, ఓ కుటుంబ పెద్దగా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. నేర రాజకీయాలు చేసే పరిస్థితి కనిపిస్తోందని, అలాంటి వారిని అందరినీ తుదముట్టించే వరకు ఈ పోరాటం ఆగదని చంద్రబాబు స్పష్టం చేశారు.

## దాడి సూత్రధారులను కఠినంగా...

ఉమ్మడి పోరులో అవసరమైన పూర్తి సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉపాధ్యక్షుడు వాన్స్‌ల మద్దతు, సంఘీభావ సందేశాలకు ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలిపినట్లు విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. అంతకుముందు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ప్రధాని మోదీకి ఫోన్ చేసి పహల్గామ్ దాడిపై సంతాపం తెలిపారు. అమాయక ప్రజల ప్రాణాలు తీసిన ఈ దాడిని తీవ్రంగా ఖండించిన ట్రంప్, సూత్రధారులను చట్టం ముందు నిలబెట్టడంలో భారత్‌కు పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఉగ్రవాదంపై పోరులో భారత్, అమెరికా కలిసి నిలుస్తాయని ఉద్ఘాటించారు. ఈ పిరికిపంద చర్యకు పాల్పడిన వారిని, దాని వెనుక ఉన్న శక్తులను కఠినంగా శిక్షించడానికి భారత్ కట్టుబడి ఉందని ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడికి స్పష్టం చేసినట్లు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

**సౌదీ నుంచి మధ్యలోనే తిరిగివచ్చిన మోదీ.. కశ్మీర్ దాడిపై ఎన్ఎస్ఏతో మీటింగ్**

కశ్మీర్‌లోని పెహల్గామ్‌లో ఉగ్రదాడిజరిగిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలియడంతో.. సౌదీ అరేబియా టూర్‌లో ఉన్న ప్రధాని మోదీ హుటాహుటిన ఇండియాకు చేరుకున్నారు. బుధవారం తెల్లవారుజామున ఆయన ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడే ఆయనకు పెహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి గురించి అధికారులు వివరించారు. ఆ ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. నేషనల్ సెక్యూర్టీ అడ్వైజర్ అజిత్ దోవల్, విదేశాంగ మంత్రి ఎస్ జయశంకర్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రి ఉగ్రఘాతుకం గురించి వివరించారు. పెహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని మోదీ ఖండించారు. ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు సంతాపం తెలిపారు. గాయపడ్డవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. కశ్మీర్ ఉగ్రదాడిలో చనిపోయినవారిలో మహారాష్ట్ర నుంచి అయిదుగురు ఉన్నారు. అయితే వారి మృతదేహాలను తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏకనాథ్ షిండే కోరారు. జమ్మూ కశ్మీర్‌లో చిక్కుకున్న మహారాష్ట్ర టూరిస్టులకు తీసుకువచ్చేందుకు ప్రత్యేక విమానాన్ని ఏర్పాటు చేయాలని షిండే కోరారు. అయితే చిక్కుకున్న టూరిస్టుల వివరాలు తెలియగానే విమానం ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఉగ్రదాడి ఘటనను ఖండిస్తూ ప్రపంచ దేశాధినేతలు సంతాపం తెలిపారు. మోదీని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫోన్‌లో సంభాషించారు. రాష్ట్రపతి ముర్ముకు రాసిన లేఖలో రష్యా అధ్యక్షుడు పుతిన్ సంఘీభావాన్ని తెలిపారు.

## ఉగ్రవాదానికి భారత్ తలొగ్గదు : అమిత్ షా



న్యూఢిల్లీ : ఉగ్రవాదానికి భారత్ ఎన్నటికీ తలొగ్గదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. 'భారమైన హృదయంతో పెహల్‌గామ్ ఉగ్రదాడిలో మరణించిన వారికి అంతిమ నివాళులర్పిస్తున్నాను. భారత్ ఉగ్రవాదానికి తలొగ్గదు. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని వదిలిపెట్టబోం' అని షా తీవ్రంగా హెచ్చరించారు. ఈ మేరకు మృతులకు నివాళులర్పిస్తున్న ఫొటోలను ఎక్స్‌లో పోస్టు చేశారు. బుధవారం ఉదయం శ్రీనగర్ చేరుకున్న అమిత్ షా.. పెహల్‌గామ్ ఉగ్రదాడి మృతులకు నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారిని పరామర్శించి ఓదార్చారు. వారి వేదనను విన్నారు. ఈ సందర్భంగా తమ ఆప్తులను కోల్పోయిన వారు కేంద్ర మంత్రి ముందు కన్నీటి పర్యంతమయ్యారు. విహారయాత్ర కోసం వస్తే మావాళ్లను పొట్టన పెట్టుకున్నారంటూ రోదించారు. ఘటనకు కారణమైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరన్ ప్రాంతంలో ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్న పర్యాటకులపై అడవిలో నుంచి హఠాత్తుగా ప్రత్యక్షమైన ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. మహిళలు, పిల్లలను వదిలిపెట్టి కంటికి కనిపించిన పురుషులను కాల్చుకుంటూ పోయారు. ఈ దాడిలో సుమారు 28 మంది టూరిస్ట్‌లు ప్రాణాలు కోల్పోయారు. ముగ్గురు, నలుగురు ఉగ్రవాదులు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

## ఉగ్రదాడి తీవ్రంగా...

భారత ఐక్యతను ఏ ఉగ్రవాదం విచ్ఛిన్నం చేయలేదు. ఇలాంటి దారుణాలు మరోసారి జరగకుండా చూడాలి. సమష్టిగా మనం దీన్ని అధిగమిద్దాం... కలిసికట్టుగా ఉందాం. ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుంది" అని పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు. ఈ ఉగ్రదాడిని ఖండిస్తూ మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో పార్టీ జెండాను అవనతం చేశారు.

## విజయం సాధించని వారు...

ఫలితాల్లో 81.14 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో అబ్బాయిలు 78.31 శాతం, అమ్మాయిలు 84.09 శాతం ఉత్తీర్ణులయ్యారు.అలాగే 1,680 స్కూళ్లలో వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. 19 స్కూళ్లలో సున్నా శాతం ఉత్తీర్ణత నమోదు కాగా... పార్వతీపురం మన్యం జిల్లాలో అత్యధికంగా 93.90 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

**ఈ ఫలితాలు చాలా సంతోషాన్నిచ్చాయి: మంత్రి నారా లోకేశ్ :**

"ఈ సంవత్సరం 6,14,459 మంది విద్యార్థులు పరీక్ష రాయగా... 4,98,585 మంది ఉత్తీర్ణులై 81.14% ఉత్తీర్ణత నమోదైంది. పార్వతీపురం మన్యం జిల్లా 93.90% ఉత్తీర్ణత రేటుతో అగ్రస్థానంలో ఉండటం, 1,680 పాఠశాలలు 100% ఫలితాలు సాధించడం చూసి నేను సంతోషంగా ఉన్నాను. ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ నా హృదయపూర్వక అభినందనలు. విజయం సాధించని వారు నిరుత్సాహపడకండి. జీవితం రెండవ అవకాశాలను అందిస్తుంది. సప్లిమెంటరీ పరీక్షలు మే 19 నుంచి 28 వరకు జరుగుతాయి. ఇది విజయం సాధించడానికి మరొక అవకాశాన్ని అందిస్తుంది. ఫలితాల కోసం http:// bse.ap.gov.in, http:// results.bse.ap.gov.in తో పాటు వాట్సాప్ (మన మిత్ర): 95523 00009 కు 'హాయ్' అని పంపండి" అని మంత్రి లోకేశ్ ట్వీట్ చేశారు. ప్రభుత్వం ఇటీవల లీప్ అనే మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. దీని ద్వారా ఉపాధ్యాయులు, ప్రధనోపాధ్యాయులు వారి పాఠశాలల్లోని విద్యార్థుల ఫలితాలు చూసుకోవచ్చు. ఇక ఇదే యాప్‌లో తల్లిదండ్రులు కూడా లాగిన్ అయి... వారి పిల్లల ఫలితాలను చూసుకునే వెసులుబాటు ఉంటుంది.

## ఉత్తరాంధ్రకు...

మండిపడ్డారు. టీడీపీ హయంలో అభివృద్ధి జరిగితే, వైసీపీ హయంలో విధ్వంసం జరిగిందని అన్నారు.

**జగన్ హయంలో పోలవరం విధ్వంసం.. :**

తెలుగు దేశం హయంలో పోలవరం ప్రాజెక్టును 72 శాతం పూర్తి చేశామని... ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ హయాంలో పోలవరం విధ్వంసం జరిగిందని రామానాయుడు అన్నారు. జగన్ పోలవరం ప్రాజెక్టును రెండు ముక్కలుగా చేశారని దుయ్యబట్టారు. పోలవరం ప్రాజెక్టు ఫేజ్ 1, 2 రెండుగా విభజించారని, పోలవరం నిర్వాసితులకూ అన్యాయం జరిగిందన్నారు. పోలవరంపై జగన్ కక్ష కట్టారని.. అసెంబ్లీలో ప్రాజెక్టును పూర్తి చేస్తామని మూడు డేట్స్ చెప్పినా జగన్ పూర్తి చేయలేదన్నారు. డయా ఫ్రం వాల్‌ను పట్టించుకోలేదన్నారు. పోలవరం లెఫ్ట్ కెనాల్‌కు తట్టెడు మట్టి జగన్ వేయలేదు.. ఇప్పుడు మేము పనులు వేగవంతం చేశామన్నారు.

**ఉత్తరాంధ్రకు కొత్త కంపెనీలు :**

ఉత్తరాంధ్రలో వైసీపీ హయంలో 5 ఏళ్లలో 5 పైసల కూడా ఖర్చు పెట్టలేదని, 2027 డిసెంబర్ నాటికి పోలవరం నిర్మాణం పూర్తి చేస్తామని మంత్రి నిమ్మల తెలిపారు. పోలవరం ఎత్తు విషయంలో వైసీపీది అసత్య ప్రచారమని అన్నారు. పోలవరం ప్రాజెక్ట్ బహుళ ప్రయోజనాలు, నదుల అనుసంధానం నెరవేరాలంటే 45.72 మీటర్ల దగ్గర ప్రాజెక్ట్ కట్టాలన్నారు. నిర్వాసితుల పరిహారం పూర్తి చేసే వరకు 41.72 దగ్గర కాంటూరుకు పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఉత్తరాంధ్రకు కొత్త కంపెనీలు వస్తాయన్నారు. వైఎస్ జగన్ ఉత్తరాంధ్ర యువత పొట్ట కొట్టారని, యువతకు ఉపాధి కల్పించే విధంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కృషి చేస్తున్నారని మంత్రి తెలిపారు.

**వైసీపీ దాష్టికాలు.. :**

వైసీపీ దాష్టికాలు భరించలేక అనేక కంపెనీలు రాష్ట్రం వదిలి వెళ్లిపోయాయని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. కొత్త కొత్త కంపెనీలు పెట్టుబడిదారులు రాష్ట్రానికి వస్తుంటే వైసీపీ నేతలు ఆవాకులు, చెవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర విభజన సమయంలో కంటే వైసీపీ పాలనలో రాష్ట్రానికి ఎక్కువ నష్టం జరిగిందన్నారు. ఋషి కొండ ప్యాలెస్.. ఋషికొండ వైట్ ఏలిఫెంట్ మాదిరిగా తయారు అయిందన్నారు. ఋషికొండ భవనాలు వినియోగంపై ఆలోచన చేస్తున్నామని రామానాయుడు తెలిపారు.

## కాకినాడ అమ్మాయి...

4,98,585 మంది పాసైనట్లు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ ఫలితాల్లో 93.90 శాతం ఉత్తీర్ణతతో పార్వతీపురం మన్యం జిల్లా అగ్రస్థానంలో నిలవగా, అల్లూరి సీతారామరాజు జిల్లా చివరి స్థానంలో నిలిచింది. బాలికలు 84.09 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలురు 78.31 శాతం ఉత్తీర్ణత సాధించారు. మే 19 నుంచి 28 వరకు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు.

## కశ్మీర్‌లో చిక్కుకున్న...



చేశారు. కాగా, జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం లో పర్యటకులపై జరిగిన ఉగ్రదాడి పై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. భారత్‌పై కుట్ర పన్నుతున్న వారిని ఊరికే వదలబోమన్నారు. దాడికి భారత్ గట్టి బదులిస్తుందని హెచ్చరించారు. పహల్గాం ఉగ్రదాడిని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఆ ఉగ్రదాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించాలనేది భారత్ విధానమని, ఉగ్రవాదులను ఎదుర్కొనే విషయంలో దేశ ప్రజలంతా ఐక్యంగా ఉన్నారని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. తమ కుటుంబసభ్యులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. దాడికి పాల్పడిన వాళ్లను, కుట్ర పన్నిన వాళ్లను బయటకు లాగి తగిన బుద్ధి చెబుతామన్నారు.

**ఉగ్రవాదానికి భారత్ తలొగ్గదు : అమిత్ షా**

ఉగ్రవాదానికి భారత్ ఎన్నటికీ తలొగ్గదని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా (%ూఎౌ ాప్థుప్ష్ర%) స్పష్టం చేశారు. 'భారమైన హృదయంతో పెహల్‌గామ్ ఉగ్రదాడిలో మరణించిన వారికి అంతిమ నివాళులర్పిస్తున్నాను. భారత్ ఉగ్రవాదానికి తలొగ్గదు. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని వదిలిపెట్టబోం' అని షా తీవ్రంగా హెచ్చరించారు. ఈ మేరకు మృతులకు నివాళులర్పిస్తున్న ఫొటోలను ఎక్స్‌లో పోస్టు చేశారు.

## నిశ్చితార్థ కార్యక్రమానికి హాజరైన....
# ఎమ్మెల్యే డాక్టర్ వి ఎం థామస్



వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 23: తిరుపతి నగరంలో ఉదయ్ ఇంటర్నేషనల్ హోటల్ లో సాంస్కృతిక విభాగ ప్రధాన కార్యదర్శి మునిచంద్రా రెడ్డి గారి మేనల్లుడు నిశ్చితార్థ కార్యక్రమానికి హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించిన ప్రభుత్వ విప్ మరియు జీడీ నెల్లూరు శాసనసభ్యులు (ఎమ్మెల్యే) డాక్టర్ వి ఎం థామస్, టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పదవ తరగతి ఫలితాల్లో ....
# వీ ఎస్ ఎన్ విద్యార్థుల విజయదుందుభి



పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 23: అన్నమయ్య జిల్లా పీలేరు వీఎస్ఎన్ విద్యాసంస్థలకు చెందిన పి.వెన్నెల స్నేహిత రికార్డ్ స్థాయిలో 598 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రెండవస్థానంలోనూ, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రథమ స్థానం లో ఎస్.రెడ్డి తనూజ ఆర్.స్నేహ సాయి 594 మార్కులు సాధించిన విద్యార్థులను బిఎస్ఎన్ విద్యాసంస్థల అధినేత్రి మాధవి అభినందించారు.గడిచిన 25 ఏళ్లుగా తా ము అవిశ్రాంత కృషి చేసి విద్యారంగంలో పీలేరును ఉన్నత స్థానంలో నిలుపుతు న్నామని ఆమె తెలిపారు. ఈ ఏడాది ఉన్నత ఫలితాల సాధనలో కష్టపడిన విద్యార్థులను, సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.

# వివాహిత ఆత్మహత్య



గంగవరం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 23: చిత్తూరు జిల్లా ...పలమనేరు పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలం: ప్రభుత్వ ఆసుపత్రి వర్గాలు తెలిపిన సమాచారం మేరకు, కూర్నిపల్లి గ్రామంలో సుబ్రహ్మణ్యం భార్య శైలజ మంగళవారం రాత్రి ఉరి వేసుకుందని గమనించిన కుటుంబీకులు హుటాహుటిన పలమనేరు ఏరియా ఆసుపత్రికి తీసుకురావడం జరిగింది, చికిత్స అందించిన తాము మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేయడంతో మార్గమధ్యంలో మృతి చెందిందని తెలిపారు. కాగా ఘటనపై పోలీసులకు సమాచారం అందించి పోస్టుమార్టంకు తరలించామన్నారు. కాగా శైలజ ఉరి వేసుకుందా లేదా మరి ఇంకేదైనా కోరం ఉందా అనేది పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

## కె.నక్కనపల్లి ఎం.పి.పి పాఠశాలలో.....
# ఘనంగా ఫేరవల్ డే



వీ.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 23: వి.కోట మండలం కె.నక్కనపల్లి గ్రామంలో ఉన్న ఎం.పి.పి.పాఠశాలలో బుధవారం ఘనంగా ఫేరవల్ డే ప్రధాన ఉపాధ్యాయు రాలు సునంద ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ క్రైమ్ కంట్రోల్ ఫోర్స్ పలమ నేరు డివిజన్ అధ్యక్షుడు జిక్రియ (సలీమ్అహ్మద్)మాట్లాడుతూ విద్యార్థిని విధ్యార్థులకు వేసవి సెలవులు దృష్ట్యా తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పిల్లలపై దృష్టి పెట్టాలని వారికి మంచి భవిష్యత్తును ఇచ్చేలా వారిని ఎప్పటికప్పుడు ప్రోత్సహిం చాలని తల్లిదండ్రులకు ఆయన కోరారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాలు జిక్రియ ని దుశ్శాలవతో సన్మానించి అభినందిం చారు.ఈ కార్యక్రమంలో యన్ హెచ్ ఆర్ సి సి ఎఫ్ డిస్ట్రిక్ట్ ఉమెన్ వింగ్ వైస్ ప్రెసిడెంట్ అస్మత్,పాఠశాల ఛైర్మన్ ఆంజినేయులు, జెడ్.పి.హైస్కూల్ ఉపాధ్యాయులు,ఛైర్మన్ బి.వి.రఘు,విద్యార్థులు,గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్ద తయ్యూరు డ్రైనేజ్ పనులను....
# పరిశీలించిన డి ఈ సతీష్




ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 23: ఎస్ఆర్ పురం మండలం పెద్ద తయ్యూరు గ్రామంలో డ్రైనేజీ పనులను డి ఈ సతీష్ పరిశీలించారు. డ్రైనేజీ పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్ నాగరాజుకు తెలిపారు. అలాగే గ్రామం చుట్టూ డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమం లో ఏఈ కుమార్ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ద్రావిడ విశ్వవిద్యాలయంలో ప్రముఖ ఆంగ్ల నాటక రచయిత....
# విలియం షేక్స్పియర్ 461 వ జయంతి ఉత్సవాలు




గుడిపల్లి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 23: కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండలంలోని ద్రావిడ విశ్వవిద్యాలయం, ఆంగ్ల శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ ఆంగ్ల నాటక రచయిత విలియం షేక్స్పియర్ 461 వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పద్య పోటీలలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో మొదటి విజేతగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, క్రిష్ణగిరి వారు, రెండవ విజేతగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల,పాకాల మరియు తృతీయ బహుమతి ద్రావిడ విశ్వవిద్యాల పరిశోధక విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎం దొరస్వామి మాట్లాడుతూ విలియం షేక్స్పియర్ నాటకాలు ఈనాటికి కొత్తదనంతో సమకాలీన అంశాలతో దగ్గరగా ఉంటూ అలరిస్తున్నాయి అన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి కిరణ్ కుమార్ మాట్లాడుతూ విలియం షేక్స్పియర్ జన్మదిన వేడుకల్ని విశ్వవిద్యాలయం జరుపుకోవడం పట్ల ఆనందాన్ని వ్యక్తపరిచారు. డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య కే. శ్యామల మాట్లాడుతూ ఇలాంటి పోటీలు జ్ఞాన సమపార్జనకు, వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతాయి అన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఆంగ్ల శాఖ అధ్యక్షులు ఆచార్య సిహెచ్ రాజేంద్రప్రసాద్ మరియు ప్రిన్సిపాల్ వి. మంజుల ప్రభుత్వ ఫస్ట్ గ్రేడ్ కళాశాల, బంగారు తిరుపతి, కోలార్ మధ్య విద్యార్థులకు సంబంధించిన,ఎం ఓ యు, పైన సంతకం చేయడం జరిగింది, ఈ ఒప్పందం వలన కర్ణాటక రాష్ట్రమునకు మరియు ద్రావిడ విశ్వవిద్యాలయమునకు విద్యార్థుల ప్రవేశాల మెరుగు పడటానికి అవకాశం ఎక్కువగా ఉన్నదని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదం దాడిలో మృతులకు సంతాపం తెలియజేసిన.....
# కుప్పం నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ నరేష్







కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 23:రాష్ట్రఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశానుసారం మూడు రోజుల సంతాప దినాలను జనసేన కుప్పం నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ నరేష్ ఆధ్వర్యంలో కుప్పం నేతాజీ రోడ్ లో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ప్రారంభించి, బస్టాండ్ ఆవరణలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ సర్కుల్లో మానవహారం నిర్వ హించి బస్టాండ్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద మౌన దీక్షలో చేసినారు.ఈ సందర్భంగా డా నరేష్ మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిలో హతమైన పర్యాటకులకు ప్రగాఢ సాను భూతి తెలుపుతూ నివాళులుఅర్పించారు. ఈ దాడికి నిరసనగా మూడు రోజులు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సూచించారు, అని తెలిపినారు.ఇప్పుడున్న ఎన్డీఏ ప్రభుత్వం భారత ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన కచ్చితం గా ఈ పాకిస్తాన్ ఉగ్రవాదులను పూర్తిగా అంతం చేస్తుందని నమ్మకం తెలిపినారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు వీరమహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# " ఉపాధ్యాయులు ఉత్తమ విద్యార్థులకు ఆదర్శం "

"విద్యార్థుల లక్ష్య సాధనకు ఉపాధ్యాయుల పాత్ర కీలకం"

"విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయునిదే"

"ఘనంగా పదవీ విరమణ సన్మాన మహోత్సవం"

కల్లూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 23,: పులిచెర్ల మండలం కల్లూరుజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఆగస్టు 2017 నుండి ఏప్రిల్ 2025 వరకు సుమారు 8 సంవత్సరములు జీవశాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేసిన కోటపల్లి వాస్తవ్యులు శ్రీమతి %ద% శ్రీ రాజేంద్ర, వరలక్ష్మి దంపతులను పాఠశాల తరఫున ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీ వాణి తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పిటిసి సభ్యులు మురళీధర్, పులిచెర్ల మండల విద్యాశాఖ అధికారులు సిద్ధరామయ్య, పోకల తాతయ్య ,రొంపిచర్ల మండలం విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు , నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పోతంశెట్టి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ జీవశాస్త్ర ఉపాధ్యాయులు రాజేంద్ర ఉపాధ్యాయ వృత్తిలో 36 సంవత్సరాలు పనిసేసి అనేక సేవలను అందించారు.వారి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఉత్తమ ఉపాధ్యాయులు ఎప్పుడు ఉత్తమ విద్యార్థులను తయారు చేస్తారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, బంధు మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్ష ఫలితాలలో సత్తా చాటిన.....
# కుప్పం నారాయణ పాఠశాల విద్యార్థులు



కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 23 : కుప్పం పట్టణంలోని పైబాట నందు గల నారాయణ పాఠశాలలో పదవ తరగతి పరీక్ష ఫలితాల నందు కుప్పం నారాయణ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ తెలిపారు. ఎస్. మిథున్ కృతిక్ 600 మార్కులకు గానూ 591 మార్కులతో కుప్పం నియోజక వర్గంలో ప్రథమ స్థానంతో సాంధించారు. అదేవిధంగా నిఖిత – 587, భువన్ సాయి – 586, సాత్విక – 584, అక్షయ – 583, శశాంక్ సాయి – 581, జాన్సీ – 577, సాయిశ్వని 574 మార్కులు సాధించారు. 21 మంది విద్యార్థులు 500 మార్కులు పైన సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను డీజీఎం కొండల రావు, ఏజీఎం.పుణికుమార్, ఆర్ ఐ ప్రసాద్ , జోనల్ కో ఆర్డినేటర్ శ్రీకాంత్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ఏజీఎం బాలక్రిష్ణ, వైస్ ప్రిన్సిపాల్ లక్షలణ్, ఏడి ప్రదీప్, ఏవో నరేష్ మరియు ఉపాధ్యాయ, ఉపాధ్యాయిని బృందం పాల్గొన్నారు.

## ద్రావిడ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో కంప్యూటర్ ల్యాబ్ ను......
# ప్రారంభించిన ఉపకులపతి ఆచార్య ఎం. దొరస్వామి






గుడిపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 23: కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండలం లోని ద్రావిడ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో రూసా నిధులతో నూతనంగా నిర్మించిన డాక్టర్ నందమూరి తారక రామారావు క్లాస్ రూమ్ కాంప్లెక్స్ లో అత్యాధునిక వసతుల తో నిర్మించబడిన కంప్యూటర్ ల్యాబ్ ను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎం.దొరస్వామి ప్రారంభించారు. బుధ వారం రోజు నుంచి ఈ కంప్యూటర్ ల్యాబ్ ను విశ్వవిద్యాలయంలోని విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. అదేవి ధంగా రాష్ట్రస్థాయి ఉమ్మడి ప్రవేశ పరీక్షల ను నిర్వహించుటకు ఈ ల్యాబ్ ఉపయోగ పడుతుందని అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి. కిరణ్ కుమార్, డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య కే. శ్యామల, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య విజయవర్ధిని, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరికృష్ణ,యూనివర్సిటీ ఇంజనీర్ ఎం సి.రఘుపతి,ఆచార్యులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## సమస్య పై స్పందించిన ....
# ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ డాక్టర్ థామస్



ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 23: ఎస్ఆర్ పురం మండలం 49 కొత్తపల్లి మిట్ట దళిత వాడ గ్రామంలో, విద్యుత్ ట్రాన్స్ఫర్ లేక ఇబ్బంది పడుతున్న, ప్రజల సమస్యను స్థానిక టిడిపి నాయకులు గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ గారికీ విద్యుత్ సమస్యలను తెలియజేయడంతో, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ థామస్, విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి కొత్త ట్రాన్స్ఫర్ ఏర్పాటు చేయడం జరిగింది. 49 కొత్తపల్లి గ్రామ ప్రజలు ఎమ్మెల్యే థామస్ సార్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి టిడిపి నాయకుడు దాసరి జీవన్ కుమార్ మురుగేష్ కన్నయ్య బాలరాజ్ హరిబాబు నాగరాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పింఛన్ల పంపిణీలో అవినీతికి పాల్పడితే ......
# కఠిన చర్యలు: ఏం.పీ.డీ.ఓ



శాంతిపురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 23: కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలంలోని విద్యా మరియు సంక్షేమ సహాయకులతో పింఛను పంపిణీ మరియు కొత్త పింఛన్ల మంజూరు పై ఎంపీడీవో ఏ.పీ. ఆర్. కుమార్ బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతినెల ప్రతిష్టాత్మకంగా ఒకటవ తేదీ పింఛను పంపిణీ కార్యక్రమం జరుగుతున్నది, పింఛను పంపిణీ కార్యక్రమంలో సుమారు 185 మంది సచివాలయం సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు, వెలుగు సంఘాల లీడర్లు, పాల్గొని పింఛను పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు ,పించన్ పంపిణీ లో కొందరు సిబ్బంది మరియు బయట వ్యక్తులు పెన్షన్ దారుల నుండి పింఛను పంపిణీ సమయంలో నగదు వసూలు చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు వస్తున్నాయని వీటిపై విచారణ జరిపి వాస్తవమని తేలితే అట్టివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.సదరు విషయంపై ప్రజల్లో అవగాహన కల్పించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే ఎంపీడీవో, పథక సంచాలకులు కడ కుప్పం, మరియు జిల్లా కలెక్టర్ చిత్తూరు, మరియు టోల్ ఫ్రీ నెంబర్లకు ఫిర్యాదు చేయాలని ప్రజలను ఈ సందర్భంగా కోరారు.

## భక్తితో కొలిస్తే కొంగుబంగారం ఇచ్చే.....
# వరాల తల్లి ఆరిమాని గంగమ్మ



ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 23: భక్తితో కొలిస్తే కొంగుబంగారం ఇచ్చే వరాల తల్లి ఆరిమాని గంగమ్మ అని భక్తుల నమ్మకం ఆరిమకలపల్లి లో వెలసిన శ్రీ ఆరిమానీ గంగమ్మ ఆలయంలో బుధవారం చంగ్రాయన్ రమేష్ కుటుంబ సభ్యులు బుధవారం ప్రత్యేక అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని అలంకరించారు అమ్మవారికి మొక్కు చెల్లించి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే అమ్మవారి ఆలయానికి 10116 రూపాయలను విరాళంగా చంగల్ రాయలన్ అందించారు. ఈ కార్యక్రమంలో రమేష్ ఉష జస్వంత్ చంగ్రాయన్ కుటుంబ సభ్యులు అలాగే మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి ఆలయ సిబ్బంది, మోహన్ బాబు ప్రకాష్ పాల్గొన్నారు.

## ఈనెల 27న విశాఖపట్నంలో ....
# బాస్ రాష్ట్ర కమిటీ ప్రతినిధుల సమావేశం

పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 24: అన్నమయ్య జిల్లా పీలేరు భారతీయ అంబేద్కర్ సేన (బాస్) రాష్ట్ర కమిటీ ప్రతినిధుల సమావేశం, ఈనెల 27వ తేదీ ఆదివారం "విశాఖపట్నం"లోని అంబేద్కర్ భవన్ (అంబేద్కర్ లైబ్రరీ) నందు నిర్వహిం చబడుతున్నది బాస్ రాష్ట్ర కమిటీ ప్రతిని ధులు తప్పక హాజరు కావాలని భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పీలేరులో పాత్రికేయులతో మాట్లాడుతూ భారతీయ అంబేద్కర్ సేన "లక్ష్యం – మార్గం – కార్యాచరణ" పై ఈ సమావేశం లో చర్చించడం జరిగిందని.ఈ సమావేశాని కి ముఖ్య అతిథులుగా బాస్ వ్యవస్థాపకు లు పీటీయం శివప్రసాద్ మరియు విశ్రాంత యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు,ప్రొఫెసర్ కె.ఎస్.చలం,బాస్ కేంద్ర కమిటీ సమన్వయకర్త దుర్గం సుబ్బారావు లు హాజరై, భవిష్యత్ కార్యాచరణపై నూతన రాష్ట్ర కమిటీ ప్రతినిధులకు దిశానిర్దేశం చేస్తారని,కావున బాస్ రాష్ట్ర కమిటీ ప్రతినిధులు ఈసమావేశానికి తప్పక హాజరుకావాలని పాలకుంట శ్రీనివాసులు కోరారు.



## ప్రకృతి వ్యవసాయానికి గ్రామాల్లోని....

# రైతులు భాగస్వామ్యం కావాలి



రొంపిచెర్ల,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 23: ప్రకృతి వ్యవసాయానికి గ్రామాల్లోని రైతులు భాగస్వామ్యం కావాలని నేచరల్ ఫార్మింగ్ అసోసియేట్ అధికారిణి నాంచా రమ్మ అన్నారు. రొంపిచర్ల మండలం బొమ్మ య్య గారి పల్లి యూనిట్ పరిధిలో నవధా న్యాల సాగు పై డ్వాక్రా సంఘాల సభ్యుల తో పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. నేచరల్ ఫార్మింగ్ అసోసియేట్ అధికారిణి నాంచారమ్మ మాట్లాడుతూ ప్రకృతి వ్యవ సాయం చేయడం వలన రైతుల యొక్క ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. రసాయన ఎరువులు తగ్గించి, ప్రకృతి వ్యవ సాయం చేయడం వల్ల భూమి సారవంతం గా ఉండి పంటలు బాగా పండి రైతుల ఆరో గ్యాలు మెరుగుపడతాయని అన్నారు. మాస్టర్ ట్రైలర్ రమేష్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో వివిధ రకాల నవధాన్య పంటలు పండించడం వలన భావితరాలకు భవిష్యత్తు బాగుంటుంద న్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా తయారు చేసిన సేంద్రియ ఎరువులతో విత్తన గులికలు తయారు చేసే విధానం లాభాలను వివరించారు. గ్రామంలోని పురవీధులలో ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు యల్లప్ప ఉపాధ్యాయులు,మదన మోహన్ రెడ్డి,మాస్టర్ ట్రైనర్ ఎన్.రమేష్, యూనిట్ ఇంఛార్జి లు రెడ్డెమ్మ, కోమల, ఫార్మర్ సైంటిస్ట్ విజయలక్ష్మి, ఐ సి ఆర్ పి లు అనంతలక్ష్మి రూపకళ,సుధారాణి ఓబు లేసు,రెడ్డేమ్మ,మహిళా సంఘాల సభ్యులు, రైతులు,స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి ఫలితాల్లో .....

# శ్రీచైతన్య టెక్నో మండల టాప్



వి.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 23: చిత్తూరు జిల్లా వీకోట మండలం, రాష్ట్ర ప్రభుత్వం నేడు విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లో మండలంలోని మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్న శ్రీచైతన్య టెక్నో .విద్యార్థులను అభినందించిన వీకోట మండల ఎంఈఓ చంద్రశేఖర్.బుధవారం ఉదయం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా విడుదలైన "పది" ఫలితాల్లో విజయవాడ వారి శ్రీచైతన్య టెక్నో స్కూలు విజయదుం దుభి మ్రోగించింది. పట్టణానికి చెందిన కృష్ణ శెట్టి కుమార్తె డి.కె. లక్ష్య 589/600 మార్కులు సాధించి మండల మొదటి ర్యాంకు పొందిందని పాఠశాల ప్రిన్సిపాల్ భానుకిరణ్ రెడ్డి పేర్కొన్నారు.అదే విధంగా మండల మూడవ ర్యాంకు గౌతమి 586/600, 584/600 మార్కులతో హిందూజా మండల ఐదవ ర్యాంకు సాధించిందని, ధనుశ్రీ 582 మార్కులు సాధించిందని తెలిపారు. ఫలితాల అనంతరం పాఠశాల ఆవరణలో కేక్ కోసి, బాణాసంచా పేల్చి సంబరాలు జరుపు కున్నారు.తెలుగు ,మ్యాథ్స్ ,సోషియల్ సబ్జెక్టులలో వంద మార్కులు 7 మంది విద్యార్థులు సాధించారని పాఠశాల ఆర్ ఐ చక్రధర్ తెలిపారు. ఎస్సెస్సీ పరీక్షల్లో ఘనవిజయం సాధించిన విద్యార్థులకు పాఠశాల ఏజీఎం సురేష్ శుభాకాంక్షలు తెలియజేశారు. .ఇంతటి గొప్ప మార్కుల సాధనకు కృషిచేసిన పాఠశాల ఉపాధ్యా యులను ఏజిఎం,ఆర్ఐ,ప్రిన్సిపల్ అభినం దించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బోడి రెడ్డి చిన్నమ రెడ్డి గారి కర్మక్రియలకు

## హాజరై నివాళులర్పించిన....

# ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ వి ఎం థామస్



వెదురు కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 23: వెదురుకుప్పం మండలం పెరుమాలపల్లి గ్రామం బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ హనుమంత రెడ్డి తండ్రి కీర్తిశేషులు బోడి రెడ్డి చిన్నమ రెడ్డి గారి కర్మక్రియలకు హాజరై నివాళు లర్పించిన ప్రభుత్వ విప్ మరియు జీడీ నెల్లూరు శాసనసభ్యులు (ఎమ్మెల్యే) డాక్టర్ వి ఎం థామస్ టిడిపి నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబా స్కూల్ లో ....

# ఘనంగా వార్షికోత్సవ సంబరాలు

కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 23: కుప్పం మునిసిపల్ పరిధిలో గల సాయి బాబా స్కూల్ లో ఘన్నగా వార్షికోత్సవ సంబరాలు,ఈ కార్యక్రమంలో కరస్పాం డెంట్ రవికుమార్,హెచ్ఎం యాస్మిన్, మరియు ఉపాధ్యాయులు, విద్యార్థి, విద్యార్థులుపాల్గొన్నారు.



# శ్రీసిటీని సందర్శించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్

శ్రీసిటీ,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 23: గుప్తా ఆక్సిజన్ పరిశ్రమకు భూమిపూజ పరిశ్రమ ప్రతినిధులతో సమావేశం-శ్రీసిటీ ప్రగతి,మౌళిక సదుపాయాలు,హరిత కార్యక్రమాలపై ప్రశంస.రాష్ట్ర ఎంఎస్ఎం ఈ,సెర్ప్,న్ఆర్ఐ సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బుధవారం శ్రీసిటీని సందర్శించారు. ఆయనకు సాదర స్వాగతం పలికిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీ ప్రపంచ శ్రేణి మౌళిక సదుపాయాలు, పారిశ్రామిక ప్రగతిని వివరించారు. శ్రీసిటీ పరిశ్రమలలో మధ్య, చిన్న తరహా పరిశ్రమల శాతం ఎక్కువగా ఉందన్న ఆయన,ఉపాధి కల్పన,ఆవిష్కరణలు, సరఫరా గొలుసుతో పాటు మంచి పర్యావరణ వ్యవస్థ సృష్టికి ఇది దోహదం చేస్తోందన్నారు. ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్ విడిభాగాలు, ఇంజనీరింగ్ వస్తువులు,ఆహార పదార్థాలతో సహా శ్రీసిటీ లో తయారయ్యే విస్తృత శ్రేణి ఉత్పత్తుల ప్రదర్శనను మంత్రి తిలకించారు. గుప్తా ఆక్సిజన్' పరిశ్రమకు శంకుస్థాపన.. కేటగి రికి చెందిన నూతన పరిశ్రమ గుప్తా ఆక్సి జన్ ప్రైవేట్ లిమిటెడ్ శంకుస్థాపన కార్యక్రమంలో శ్రీసిటీ ఎండీతో కలసి మంత్రి పాల్గొన్నారు. ఆ సంస్థ ఎండి, సీఈఓ, ఆనంద్ గుప్తా వారికి స్వాగతం పలికారు. శ్రీసిటీ వృద్ధిలో మరో ముందడుగుగా పేర్కొ న్న మంత్రి,పరిశ్రమ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.శ్రీసిటీ పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను ఈ కంపెనీ మరింత సుసంపన్నం చేస్తుందని డాక్టర్ సన్నారెడ్డి



వ్యాఖ్యానించారు.40 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్న ఈ పరిశ్రమ 2025 అక్టోబర్ నాటికి ఉత్పత్తులు ప్రారంభించనుంది. 'డ్యూగ్యాస్' పేరిట పారిశ్రామిక గ్యాస్ ను ఇది తయారు చేస్తుంది, ఏసీ, ఆటోమోటివ్ రంగాలకు గ్యాస్ సరఫరా చేస్తుంది. ప్రస్తు తం దీని కస్టమర్ల జాబితాలో గోద్రెజ్, బ్లూస్టార్, వర్ల్‌పూల్ ఇండియన్ రైల్వేలు ఉన్నాయి. అనంతరం శ్రీసిటీ పరిసరాల్లో మంత్రి పర్యటించారు. ఎవర్టన్ టీ పరిశ్ర మను సందర్శించారు.90 శాతం పైగా స్థాని క గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పిస్తున్న ఈ పరిశ్రమ,మహిళా సాధికా రత, సమ్మి ళిత వృద్ధికి చక్కని నమూనాగా ఆయన కొనియాడారు.ప్రణాళికాబద్ధ అభివృద్ధికి అద్భుత నమూనా 'శ్రీసిటీ'..ప్రణాళికాబద్ధ మైన అభివృద్ధికి శ్రీసిటీ ఒక మంచి నమూ నాగా మంత్రి అభివర్ణించారు. పర్యటనలో భాగంగా శ్రీసిటీలో పరిశ్రమల సీఈఓ ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక కేంద్రం గా శ్రీసిటీ పనితీరును ప్రశంసించారు. పెట్టు బడిదారులకు అనుకూలమైన పర్యావరణ వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేసిన డాక్టర్ సన్నారెడ్డిని ఆయన అభినందించారు. శ్రీసిటీ పర్యటన పట్ల మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన డాక్టర్ సన్నారెడ్డి, ఈ తరహా సందర్శనలు రాష్ట్ర పారిశ్రామిక రంగాన్ని మరింత ప్రోత్సహిస్తుందన్న విశ్వాసంవ్యక్తం చేశారు. ఫెడరేషన్ ఆఫ్ స్మాల్ అండ్ మీడి యం ఎంటర్‌ప్రైజెస్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎంఈ ఇండియా) ప్రెసిడెంట్ ఏపీకే రెడ్డి, తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు.

## క్రమశిక్షణతో చదువుకుంటే ......

# విద్యార్థి జీవితం ఓ కొత్త బంగారులోకం...

## ఎస్సై సుమన్..

ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 23: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుంటే వారి జీవితం ఓ కొత్త బంగారులోకంలా ఉంటుందని ఎస్ఆర్ పురం ఎస్సై సుమన్ అన్నారు బుధవారం ఎస్ఆర్ పురం మండలం లీల లిటిల్ హైస్కూల్లో పాఠశాల వార్షికోత్సవ దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఆర్ పురం ఎస్సై సుమన్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎస్సై సుమన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతోపాటు సేవాభావంతో మెలగాలని సమాజం పట్ల అవగాహన కలిగి విధంగా నడుచుకోవాలని చదువు సంస్కారంతో కూడుకున్నదని గురువులను గౌరవించాలని సలహాలు సూచనలు ఇచ్చారు అనంతరం వివిధ ఆట పోటీలు నిర్వహించారు ఆట పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు అనంతరం విద్యార్థులు వివిధ పాటలకు డాన్స్ చేయడంతో పాఠశాల విద్యార్థులు కేరింతలతలు అలరించాయి ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జగన్నాథరెడ్డి,సునంద డాక్టర్ సోమశేఖర్ నాయుడు లీలావతి



ఉపాధ్యాయులు జయచంద్ర సత్యప్రియ పూర్ణిమ సంధ్యారాణి ఆశ శిల్పా రేవతి ప్రసాద్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## కెనమాకులపల్లి పంచాయతీ లో .....

# సంస్థాగత ఎన్నికలు కార్యక్రమం విజయవంతం

శాంతిపురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 23: కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలంలోని టిడిపి కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తం గా జరుగుతున్న పార్టీ సంస్థాగత ఎన్నికల లో భాగంగా కెనమాకులపల్లి పంచాయతీ సంస్థాగత ఎన్నికలు మండల అధ్యక్షుడు విశ్వనాథ నాయుడు ఆధ్వర్యంలో నియామక ప్రక్రియ కొనసాగింది ఈ ప్రక్రియలో బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్లు ఎన్నుకోవడం జరిగింది అలాగే పంచాయతీ పార్టీ అధ్యక్షులుగా 6 మంది పోటీ పడడం తో అధిష్టానం కొరకు జాబితలిస్టు పంపించడం జరిగింది. పంచాయితీ యూనిట్ ఇంచార్జ్ విషయంలో జయరాం రెడ్డి, ఈడుగా రమేష్, మధ్య పోటాపోటీగా జరగడంతో బడుగుమాకులపల్లి జయరాం రెడ్డిని యూనిట్ ఇన్చార్జిగా మండల అధ్యక్షులు విశ్వనాథ నాయుడు నియమించడం జరిగింది, కో యూనిట్ ఇన్చార్జిగా కుప్పం నియోజకవర్గం బీసీ సెల్ ఉపాధ్యక్షులు ఈడుగా రమేష్ ను మండల



అధ్యక్షుడు నియమిస్తూ శాంతిపురం మండలం సమన్వయ కమిటీ హామీ ఇస్తూ ఈడుగా రమేష్ కు కుప్పం నియోజకవర్గ స్థాయిలో నామిటెడ్ పదవి ఇస్తామని మండల అధ్యక్షులు ఈడుగా రమేష్ కి హామీ ఇవ్వడం జరిగింది దీనితో విజయ వంతంగా సంస్థాగత ఎన్నికలు ముగిసింది. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నంది గం ఉదయ్ కుమార్,క్లస్టర్ ఇంచార్జ్ చంద్ర, మాజీ ఏఎంసీయు వైస్ చైర్మన్ ఆర్ఎస్ నాగరాజు,గుంజర్లపల్లి సర్పంచ్ విజయరామిరెడ్డి,కేదార్నాథ్ నాయుడు,కార్యదర్శి నాగరాజు,కెనమాకులపల్లి సర్పంచ్ అభ్యర్థి ఎన్ పి శివకుమార్,ఆర్ఎస్ మణి,కోదండ నాయుడు,గుంజర్లపల్లి ఆంజనేయ రెడ్డి, వెంకటాచలపతి,శ్రీనివాసులు, అమర్నాథ్, టిడిపి ముఖ్య నేతలు మహిళాకార్యకర్తలు రూప,శ్యామలమ్మ, పావలారాణి,హేమ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కెనమాకులపల్లి బూత్ కన్వీనర్ గా ...

# సంస్థాగత ఎన్నికలో అగ్రహారం నరేష్ ఎన్నిక

శాంతిపురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 23: కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండ లం టిడిపి కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న పార్టీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా కెనమా కులపల్లి పంచాయతీ సంస్థాగత ఎన్నికలు మండల అధ్యక్షుడు విశ్వనాథ నాయుడు ఆధ్వర్యంలో నియామక ప్రక్రియ కొనసాగిం ది.ఈ ప్రక్రియలో బూత్ కన్వీనర్లు,కో కన్వీ నర్లు ఎన్నుకోవడం జరిగింది. ఈ ఎన్నికల లో కెనమాకులపల్లి బూత్ కన్వీనర్ గా అగ్రహారం నరేష్ ను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నందిగం ఉదయ్ కుమార్, క్లస్టర్ ఇంచార్జ్ చంద్ర, మాజీ ఏఎంసీయు వైస్ చైర్మన్ ఆర్ఎస్ నాగరాజు,గుంజర్లపల్లి సర్పంచ్ విజయరామిరెడ్డి,కేదార్నాథ్ నాయుడు,కార్యదర్శి నాగరాజు, కెనమాకు లపల్లి సర్పంచ్ అభ్యర్థి ఎన్ పి శివకుమార్, ఆర్ఎస్ మణి,కోదండనాయుడు, యువరాజు,బి వెంకటా చలపతి, శ్రీనివాసులు,అమర్నాథ్,ఎద్దులపల్లి శ్రీనివాసులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఉగ్రదాడి నిరసనగా....

# పీలేరులో క్యాండిల్ ర్యాలీ



పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 23: అన్నమయ్య జిల్లా పీలేరు ఉగ్రదాడి సంద ర్భంగా 28 మంది టూరిస్టులు చనిపోవడం బాధాకరమని ఇందుకు నిరసనగా బుధ వారం రోజు ర్యాలీ కార్యక్రమం చేపట్టినట్టు వైఎస్ఆర్ సీపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హబీబ్ భాషా చక్రధర్ భువనేశ్వర్ రెడ్డి షాకీర్ మునీర్ అబిద్ ఆనంద్ కాలనీ చిన్న తదితరులు పాల్గొన్నారు.

## 28 నుంచి ....

# ఉచిత వేసవి శిక్షణ శిబిరం



గుడుపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 23: కుప్పం నియోజకవర్గం గుడుపల్లి మండల శాఖా గ్రంథాలయంలో ఈ నెల 28వ తేది నుండి జూన్ 6వ తేది వరకు విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు శాఖా గ్రంథాలయాధికారి సుగుణమ్మ తెలిపారు. ఉచిత వేసవి శిక్షణ తరగతుల్లో విద్యార్థిని, విద్యార్థులకు కథలు, ఆటలు పోటీలు, చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లిష్, చెస్, క్యారమ్స్, క్విజ్ తదితర అంశాలపై నైపుణ్యం కలిగిన రిసోర్స్ పర్సన్ ద్వారా శిక్షణ ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థిని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పదవతరగతి పరీక్షల్లో సతాచాటిన....

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు





గంగవరం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 23: పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలంలో విద్యార్థి పేరు.ఎం హారతి హాల్ టికెట్ నెంబర్. 252010921 ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాల గంగవరం మండలం మార్కులు.576,విద్యార్థి పేర.జి పూజ హాల్ టికెట్ నెంబర్. 2520116537 ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాల గంగవరం మండలం మార్కులు.574 పాఠశాల ఈసందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అభినందించారు.

## పదవతరగతి ఫలితాలలో .....

# జెడ్ పి హెచ్ ఎస్ బాలికల ముందజ







కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 23: కుప్పం మునిసిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పిహెచ్ ఎస్ బాలికలపాఠశాలలో 133 మంది విద్యార్థుల గాను 81 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఎస్.గగన 564, ఆర్. లక్ష్మి 537, కె.విద్యశ్రీ 528, మార్కులు పైగా సాధించారు. 500 మార్కులు పైగా 13 మంది సాధించారు. 59 మంది ప్రథమ మార్కులు 13 మంది, ద్వితీయ మార్కులు, 9మంది తృతీయ మార్కులు,సాధించడంతో విద్యార్థులను అభినందించిన ప్రధానోపాధ్యాయుడు ఎం.వెంకటేశ్వర బాబు,ఉపాధ్యాయులు, సంతోషం వ్యక్తం చేశారు.

## కుప్పం నియోజకవర్గం....

# 4 మండలాల కమిటీలు రద్దు

**నూతన కమిటీ నియమాకం గురించి త్వరలో తెలియజేస్తామంటున్న భారతీయ అంబేద్కర్ సేన స్టేట్ సెక్రటరీ యం బాలకృష్ణ.**



శాంతిపురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 23: భారతీయ అంబేద్కర్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు పి.టి.యం.శివప్రసాద్ ఆదేశాల మేరకు,భారతీయ అంబేద్కర్ సేన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు యు గణపతి సూచనల మేరకు,కుప్పం నియోజకవర్గం లో ఉన్నటువంటి పంచాయతీ కమిటీలు, నాలుగు మండల కమిటీలు, నియోజకవర్గ కమిటీలు,రద్దు పరచడం జరిగింది.నూతన కమిటీ నియమాకం గురించి తొందరలో తెలియజేస్తాము.అతి త్వరలో నాలుగు మండలాల ఇంచార్జ్ లను నియమించు నున్నామని భారతీయ అంబేద్కర్ సేన స్టేట్ సెక్రెటరీ తెలియపరచడం జరిగింది.

OWNER AND PUBLISHED BY DAMA VIJAYAKUMAR, PRINTED AT VIJAY PUBLISHERS AND PRINTERS
D.No. 1-176, ANJUR Village & Post, K.V.B.PURAM Mandal, PIN:517643, Thirupati District A.P. Mobile: 9440352036